# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని జన ఔషధి దుకాణాలను ఏర్పాటు చేయనున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**
2. **తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈరోజు మూసీ పరీవాహక ప్రాంతంలో "మూసీ నది పునరుజ్జీవ సంకల్ప యాత్ర" చేపట్టనున్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ పరీక్షల కోసం ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్‌ను నిర్వహించనున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు.**
4. **తెలంగాణలోని అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డులను ఆధునీకరించేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.**
5. **పండుగల నేపథ్యంలో భారతీయ రైల్వే ఈరోజు నుంచి 164 ప్రత్యేక రైళ్లను నడపనుంది.**

============================

కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని జన ఔషధి దుకాణాలను ఏర్పాటు చేయనున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని ప్రభుత్వ సమగ్రాసుపత్రి అభివృద్ధిపై సంబంధిత అధికారులతో కలిసి కేంద్రమంత్రి గత రాత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ …40 సెకన్లు

---

క్యాన్సర్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్ ను నిర్వహించనున్నామని రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్ కు సంబంధించిన గోడపత్రిక, కరపత్రాలను మంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముందస్తు జాగ్రత్తలు, పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. తొమ్మిది మాసాల పాటు ప్రభుత్వం నిర్వహించనున్న ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్ ను ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పేర్కొంటూ,

..వాయిస్…35 సెకన్లు

---------------------------

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈరోజు మూసీ పరీవాహక ప్రాంతంలో "మూసీ నది పునరుజ్జీవ సంకల్ప యాత్ర" చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ అధికారులు విడుదల చేశారు. ఈ రోజు ఆయన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఆలయ అధికారులతో యాదగిరిగుట్ట అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం వలిగొండ మండలం సంగెం గ్రామానికి చేరుకొని మూసీ పరీవాహక ప్రాంత రైతులతో కలిసి పాదయాత్రగా భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శిస్తారు. పలువురు రైతులతో ముఖాముఖిలో పాల్గొని, అనంతరం హైదరాబాద్ చేరుకుంటారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట రిటైల్ ధరకు మించి మద్యం విక్రయించే దుకాణాలపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఎక్సైజ్ శాఖ సిబ్బందితో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత ధర కంటే అధికంగా విక్రయించే దుకాణాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల వ్యసన నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

పండుగల నేపథ్యంలో ప్రయాణికులకు తిరుగు ప్రయాణ సౌకర్యార్థం భారతీయ రైల్వే ఈరోజు నుంచి 164 ప్రత్యేక రైళ్లను నడపనుంది. అలాగే రానున్న 3 రోజుల్లో సుమారు 476 రైళ్లను నడపనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. కాగా గత 36 రోజుల్లో 4 వేల 521 రైళ్లలో 65 లక్షల మంది ప్రయాణం చేశారని రైల్వే శాఖ వెల్లడించింది. భారతీయ రైల్వేలో బీహార్, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్‌లకు 6 కోట్ల 85 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించారని తెలిపింది. ఈ నెల 4వ తేదీన ఒక్క రోజులో మూడు కోట్ల మంది ప్రయాణికులను రైల్వే శాఖ గమ్యస్థానాలకు చేర్చిందని వెల్లడించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్‌ల ద్వారా వ్యవసాయాన్ని చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గుంటూరు జిల్లాలో ఎన్ జీ రంగా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఆచార్య ఎన్ జీ రంగాజయంతి ఉత్సవాల్లో నిన్న మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగు మందుల పిచికారి తీరును పరిశీలించిన మంత్రి వ్యవసాయ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న డ్రోన్ పైలెట్ లతో డ్రోన్ల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ (20 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రకటించిన పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ చర్యల గురించి ప్రశ్నిస్తుంటే తమ పార్టీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని జగన్మోహన్ రెడ్డి విమర్శించారు.

---------------------------

తెలంగాణలోని అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డులను ఆధునీకరించేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో పత్తి, ధాన్యం కొనుగోళ్లపై మంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్ యార్డుల్లో రైతులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పత్తి సేకరణపై సమగ్ర వివరాలు అందించే విధంగా వెబ్‌పోర్టల్ తయారు చేశామని, ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు వరితోపాటు పత్తి కొనుగోలు కేంద్రాలనూ పర్యవేక్షించాలని అధికారులకు మంత్రి సూచించారు.

---------------------------

వైద్య చికిత్సలో కీలక పాత్ర పోషిస్తున్న రేడియాలజీ పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు ప్రపంచ రేడియోగ్రఫీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. జర్మనీ దేశానికి చెందిన విల్ హెల్మ్ రాంట్ జన్ అనే శాస్త్రవేత్త 1895 వ సంవత్సరం నవంబర్ 8వ తేదీన ఎక్స్ కిరణాలను కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. ఒక సందర్భంలో రాంట్ జన్ కాథోడ్ కిరణాలను పరిశోధించేటపుడు ఎక్స్ –రే కిరణాలను కనుగొనడంతో రేడియాలజీ వైద్య చికిత్సకు అంకురార్పణ జరిగింది. వ్యాధి నిర్ధారణలో ప్రస్తుతం ఎక్స్ రే నుండి డిజిటల్ ఎక్స్ రే..., ఎం.ఆర్. ఐ, సి.టి.స్కాన్..., అల్ట్రా సౌండ్ స్కాన్ వంటి ఇమేజింగ్ పరికరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. అల్పపీడనం కారణంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రానున్న నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమలలో, తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మధ్యాహ్న భోజన పథకం ద్వారా బాలబాలికలకు నాణ్యమైన భోజనంతో పాటు, పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా పర్యటనలో భాగంగా చీరాలలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా ఆయన నిన్న తనిఖీ చేశారు. అనంతరం విజయ్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించినప్పుడే వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని అన్నారు. అప్పుడే వారు చదువుపై ఎక్కువ శ్రద్ధ కనబరిచే అవకాశముంటుందని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన పథకాలు ప్రజలకు అందజేయడంలో అధికారులు సమర్ధవంతంగా పనిచేయాలని విజయ్ ప్రతాప్ రెడ్డి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆయిల్‌పామ్ రైతులకు తగిన మద్దతు ధరలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ రైతులు, ఆయిల్‌ఫెడ్, ఉద్యానశాఖ అధికారులతో మంత్రి నిన్న సచివాలయంలో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

=====================